ఓంశ్రీసాయిరాం

ప్రేమస్వరూపులారా!

ఈనాడు మనకు కావలసినది నూతన విద్య కాదు, కొత్త విధానము కాదు, కొత్త సమాజము కాదు. ఇవేవీ ఈనాటి సమస్యలను పరిష్కరించలేవు. పవిత్రమైన మనోబుద్ధులు కలిగిన స్త్రీపురుషులు ఈనాడు కావాలి. చిత్తశుద్ధి, శీలసంపత్తి లేని సమాజంలో సద్గుణవంతులైన స్త్రీపురుషులు వుండలేరు. నీతియే లేకున్న చిత్తశుద్ధి, శీలసంపత్తి అభివృద్ధి కానేరవు. ఆధ్యాత్మికమే లేకున్న నీతి సౌశీల్యములు దీపింపవు. పవిత్రమైన భారతదేశమందు వుండినన్ని వేషభాషలు, కులమతములు- ఏ ఇతర దేశములందూ కానరావు. అనేక వేషభాషలతో, అనేక కులమతములతో భారతదేశము ఒక వికసించిన ఉద్యానవనముగా గోచరిస్తున్నది. ఇట్టి సుందరమైన ఉద్యానవనములో చక్కని పుష్పములే వేషభాషలు, కులమతములు. అనేక ముఖములతో ప్రకాశించే వజ్రమువలె శోభిల్లుచున్నది భారతీయ విద్య. దీని ప్రభావం ఇట్టిది, అట్టిది అని ఎవ్వరూ వర్ణించ లేరు. ప్రేమయే సాధనయని, సత్యమే శ్వాసయని నమ్మి జీవించిన ప్రవక్తలకు జన్మభూమి ఈ భరతభూమి. కాని, ఇట్టి పవిత్రమైన భారతదేశమునందు ఈనాడు మానవత్వాన్ని విస్మరించి బాహ్యమైన, లౌకికమైన, ప్రాకృతమైన విద్యలనభ్యసించి తమ దివ్యత్వాన్ని తాము కోల్పోతున్నారు. కనుక, సరియైన విద్యావిధానాన్ని, విద్యావిధానంయొక్క ప్రధానమైన ప్రాణసూత్రాలను అధ్యాపకులు చక్కగా గుర్తించాలి.

అనాది కాలమునుండి విశాలమైన భావములతో సమాజమునకు నీతి సౌశీల్యములను అదించుతూ వచ్చింది భారతీయ విద్య. ఐతే, ఈనాటి విద్యావిధానములో కలిగిన మార్పులేమిటి? ఈనాటి బాలబాలికలను రేపటి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత ఎవరికి, ఎంతవరకు ఉన్నది అనే విషయాన్ని గుర్తించాలి. ఈ బాధ్యత ఎవరికెంతవరకు ఉన్నదనే విషయాన్ని పరిశీలించినప్పుడే పరిష్కారము లభిస్తుంది. ఈ బాధ్యత కన్న తల్లిదండ్రులదా? బుద్ధిని వికసింపజేసే అధ్యాపకులదా? దేశోద్ధరణకై కంకణం కట్టుకొన్న రాజకీయ నాయకులదా? లేక, తమ రచనలందు సరియైన ఆశయాన్ని, ఆదర్శాన్ని నిరూపించవలసిన రచయితలదా? వీరందరూ తమతమ కర్తవ్యాలను నిజంగా నిర్వర్తించుచున్నారా? ఈ విషయంలో ఎవరి హృదయాన్ని వారు పరిశీలించుకోవాలి. అప్పుడే విద్యారంగంలోని సమస్యలు పరిష్కారం కాగలవు.

ఈనాటి విద్యార్థులయందు క్రమశిక్షణ పూర్తిగా క్షీణించిపోయినది. దీనికి కారణమేమిటి, తరుణోపాయమేమిటని మనమేమైనా విచారిస్తున్నామా? ఇట్లు విచారించకుండా కేవలం విద్యార్థులను అపార్థం చేసుకోటం సరియైనది కాదు. ఇది విద్యార్థుల దోషం కాదు. భారతీయ సంస్కృతిని ప్రతిబింబింపచేసే సరియైన రచనలను, ఆశయాలను, ఆదర్శాలను పిల్లలకు మనం బోధించటం లేదు. 'స్వాతంత్ర్యం నా జన్మ హక్కు' అని చాటిన బాలగంగాధర తిలక్, లాలా లజపతిరాయ్, బిపిన్‌చంద్ర పాల్, నేతాజీ మున్నగు స్వాతంత్ర్య సమర వీరుల త్యాగభావాలను మనం పిల్లల హృదయాలకేమైనా అందిస్తున్నామా? పితృవాక్య పరిపాలనకై తన జీవితాన్నే అంకితం గావించిన రామచరిత్రను మన పిల్లలకేమైనా వినిపిస్తున్నామా? సత్యమునకై సర్వమునూ త్యాగంచేసి చివరకు ఆలుబిడ్డలనే అమ్ముకొన్న హరిశ్చంద్రుని చరిత్రను పిల్లలకేమైనా వినిపిస్తున్నామా? రాజ్యాన్ని త్యాగంచేసి అడవిలో జీవిస్తూ కందమూలాదులనే భుజిస్తూ ఉన్నప్పటికీ ధర్మాన్ని తన స్వరూపంగా నిరూపించిన ధర్మజుని చరిత్రను పిల్లలకేమైనా వినిపిస్తున్నామా? తల్లిదండ్రుల సేవలో తన జీవితాన్నే అంకితం గావించిన శ్రవణకుమారుని భక్తిని పిల్లలకేమైనా బోధిస్తున్నామా? గురువునకై తన సర్వస్వాన్ని త్యాగంచేయటానికి సిద్ధపడిన ఏకలవ్యుని తత్త్వాన్ని మన పిల్లలకేమైనా బోధిస్తున్నామా? భగవద్భక్తియందే సర్వ శక్తీ వున్నదని గుర్తించి సంపూర్ణ శరణాగతుడై హరినామస్మరణ చేసిన ప్రహ్లాదుని చరిత్రను మన పిల్లలకేమైనా వినిపిస్తున్నామా? భారతదేశమునకే గాక యావత్ప్రపంచానికి ఆదర్శవంతమైన మానవత్వాన్ని అందించిన 'భగవద్గీత' తత్త్వాన్ని పిల్లలకేమైనా బోధిస్తున్నామా? 'అహింసా పరమో ధర్మః' అని బోధించిన బుద్ధుని వాక్యాలేమైనా మన పిల్లలకు వినిపిస్తున్నామా? జీసస్‌యొక్క కరుణా స్వభావాన్ని మన పిల్లల హృదయాలకేమైనా చేర్చుతున్నామా? మహమ్మద్‌యొక్క తత్త్వమును మన పిల్లలకేమైనా బోధిస్తున్నామా? గురునానక్ ప్రారంభించిన సామూహిక భగవత్కీర్తనయొక్క ప్రాశస్త్యాన్ని మన పిల్లల హృదయాలకేమైనా అందిస్తున్నామా? ఝాన్సీ లక్ష్మీబాయి, రుద్రమదేవి, పద్మిని మున్నగు స్త్రీల వీరత్వమును, శూరత్వమును మన బాలికలకేమైనా బోధిస్తున్నామా? ఇలాంటి పవిత్ర భారతీయుల ఆదర్శాలను మన పిల్లలకు బోధించకపోవటం చేతనే వారిలో జాతీయాభిమానము క్షీణించిపోతున్నది.

భగవంతుడిచ్చిన మతిని, గతిని, స్థితిని, సంపత్తిని సద్వినియోగపరచుకొనుటకు తగిన ఆదర్శాలను పిల్లలకు బోధించాలి. ఈనాడు విద్యార్థి సరియైన గుణమును పోషించుకొనక కలిమి, చెలిమి, బలములే ప్రధానమైనవని భావించి కాలాన్ని వ్యర్థం చేస్తున్నాడు. కలిమి, చెలిమి, బలిమి ఇవన్నీ కదలిపోయే మేఘములు. గుణమే స్థిరమైనది, నిత్యమైనది. ఇట్టి గుణమును గూర్చి బోధించకపోవటం చేతనే మన పిల్లలు పెడమార్గం పడుతున్నారు. దీనికి కారకులెవరంటే – ఇంట్లో తల్లిదండ్రులు, విద్యాలయాల్లో అధ్యాపకులు, తగిన పాఠ్యగ్రంథములందించని ప్రభుత్వమువారు, తమ బాధ్యతను గుర్తించి పిల్లల భవిష్యత్తును చక్కగా తీర్చిదిద్దవలసిన పాలకులు. ఈవిధంగా పిల్లలను అభివృద్ధి పరచవలసిన బాధ్యత అందరిపై వుంటున్నది. ఈ బాధ్యత ఏ ఒక్కరిదో

కాదు. ఇంట్లో తల్లిదండ్రులు కూడా పిల్లలకు చక్కని ఆదర్శవంతమైన, ఆనందమయమైన భావాలను బోధించాలి. కేవలం గ్రంథ పఠనం మాత్రమే ప్రధానంకాదు. బుకిష్ నాలెడ్జ్ కేవలం సూపర్‌ఫిషియల్ నాలెడ్జ్‌గా మారిపోతున్నది. మన పిల్లలకు ప్రాక్టికల్ నాలెడ్జ్ కావాలి, కామన్‌సెన్స్ కావాలి, జనరల్ నాలెడ్జ్ కావాలి. కాని, ఈనాటి పిల్లలలో కామన్‌సెన్స్, జనరల్ నాలెడ్జ్ రెండూ జీరోగా వుంటున్నవి.

మన పిల్లలు ఆదర్శవంతమైన పౌరులుగా తయారుకావటానికి తగిన శక్తిసామర్థ్యాలను అధ్యాపకులుకూడా అందించాలి. ఏదో దేశములో జరుగుతున్న అనవసరమైన చెత్తను, చిల్లర విషయాలను మాత్రం పిల్లల తలలో చేర్చుతున్నారు. ఈనాడు నీతినియమాలు ఎక్కడా కనిపించటం లేదు. విద్యాలయాలు, విద్యాసంస్థలు మాత్రం పెరిగిపోతున్నాయి. కాని, విద్యయొక్క ప్రభావం మాత్రం తరిగిపోతున్నది. అనగా, విద్యాసంస్థల క్వాంటిటీ పెరిగిందిగాని, విద్యయొక్క క్వాలిటీ తగ్గింది. దీనికి కారణమేమిటి? విద్యార్థులకు మనం సరియైన గ్రంథాలను అందించటం లేదు.

*నీతినియమాలు గ్రంథాల నిలిచిపోయె*
*హృదయమంతయు దుర్గంధ సదనమయ్యె*
*చేతలంతయు స్వార్థంపు చేతలయ్యె*
*ఇదియె ప్రోగ్రెస్సు ఈనాటి చదువుయందు.*
*మేలు చేసిన వానికే కీడుజేయు*
*కూడు పెట్టిన దాతనే కూలదోయు*
*విద్య చెప్పిన గురువునే వెక్కిరించు*
*ఇదియె ప్రోగ్రెస్సు ఈనాటి చదువుయందు.*

ఇదేనా విద్య వలన మనం పొందవలసిన అభివృద్ధి? మానవతా విలువలను విద్యార్థుల హృదయంలో చేర్చాలి. పవిత్రమైన పెద్దల సూక్తులనే పలుకు మిఠాయిలను పిల్లలకు పంచిపెట్టాలి. కేవలం పొట్టకూటికై డిగ్రీలనందించే విద్యలుకావు ప్రధానమైన విద్యలు. Education should be for life, not for a living. ప్రపంచములో పశుపక్షిమృగాదులు ఎన్ని జీవింఛటం లేదు! అవి ఏ కాలేజీకి వెళ్ళాయి? ఏ స్కూలుకు వెళ్ళాయి. కనుక, బ్రతకటానికి చదువు అక్కరలేదు. జీవితానికి చదువు కావాలి. education లో మనం elevation చూడాలి.

పిల్లలకు క్రమశిక్షణ బోధించటం, వినయవిధేయతలను వారి హృదయాలకు చేర్చటం. సమాజాభివృద్ధికి తగిన ఆదర్శాలను బోధించటం మున్నగు విషయాలలో ఆధ్యాపకులు ప్రధానమైన పాత్ర వహించాలి. అందరూ సోదరులనే ఏకత్వాన్ని వారి హృదయాలలో నింపాలి. మొట్టమొదట వారిలో జాతిమతకుల విభేదాలను నిర్మూలించాలి. Fatherhood of God, brotherhood of man అనే సత్యాన్ని బోధించాలి.

There is only one caste, the caste of humanity
There is only one religion, the religion of love
There is only one language, the language of the heart.

ఇట్టి సమత్వాన్ని లేత హృదయులైన పిల్లలకు బోధిస్తే, భవిష్యత్తులో వారెంత ఉత్తమ పౌరులుగా రూపొందగలరో మీరే యోచించవచ్చు. కనుక, మొట్టమొదట టీచర్సు తగిన ఆదర్శాన్ని నిరూపించాలి. అధ్యాపకుడు కేవలం బోధించటమేకాదు, ఆచరణరూపకమైన ప్రచారప్రబోధలు చేయాలి. ఈనాటి అధ్యాపకులు డ్రిల్‌టీచరు మాదిరి ఉండాలి. ఈ డ్రిల్‌టీచరు బోర్డుపై వ్రాసి బోధించడు. 'వన్, టు, త్రీ, ఫోర్..' అంటూ ఎక్సర్‌సైజులను తాను చేసి చూపిస్తాడు. అదేవిధముగా, ఏ సద్గుణములైతే పిల్లలకు బోధించాలనుకుంటున్నారో వాటిని మొదట మీరు అనుసరించి, ఆచరించి బోధించాలి. అదే ప్రాచీన ఋషికులములలో వుండినటువంటి సరియైన సద్విద్య.

మానవత్వములో దేహము, మనస్సు రెండూ వుంటున్నాయి. దేహము నిలబడటం చాలా సులభము, పరుగెత్తటం చాలా కష్టం. కాని, మనస్సుకు పరుగెత్తటం సులభం, నిల్చుకోవటం కష్టం. ఇదే మనస్సుకు, దేహానికి మధ్యనున్న వ్యత్యాసం. మనస్సునుండి పుట్టినవాడే మానవుడు. మనిషంటే మనస్సే, మనస్సంటే మనిషే. ఈరెండింటి ఏకత్వాన్ని గుర్తించాలి. మను–జ, అనగా మనుచక్రవర్తినుండి పుట్టినవాడు. మనువుయొక్క లక్షణాలు ఏమిటి? 'సద్గుణంబులు, సద్బుద్ధి, సత్యనిరతి, భక్తి, క్రమశిక్షణ, కర్తవ్యపాలనంబు' ఇవే నిజముగా మనిషి అనుసరించవలసినవి. ఇవే మానవతా విలువలు. మంచి మనస్సు కలవాడే మానవతా విలువలు కలవాడు. గుడ్‌మైండే – గాడ్‌మైండ్.

ఈనాటి ప్రపంచములో పిల్లల గుణములు అరీతిగా తరుగుతూ వచ్చినవి? ప్రాచీన మహర్షులు అనుభవించిన మార్గములు ఏమిటి? నాటి ప్రాచీన యుగమునకు, నేటి ఆధునిక యుగమునకు ఎంత వ్యత్యాసమున్నదో ఒక్క పదములో మీరు యోచించవచ్చు. ఆనాటి తల్లిదండ్రులు, గురువులు, ఋషులు అందరూ పిల్లలను 'God-boy, God-boy' అని పిలిచేవారు. కాని, ఈ ఆధునిక

యుగము ప్రారంభమయ్యేసరికి దానికొక 'జీరో'ను చేర్చి, 'Good boy, Good boy' అని పిలుచుతూ వచ్చారు. మరికొంత కాలానికి అది 'Good bye, Good bye' గా మారుతూ వచ్చింది. చిట్టచివరికి అందులో Good పోయి కేవలం bye, bye గా మారిపోయింది. ఇది ఈనాటికి వచ్చిన మార్పు. ఆనాటి Gog-boy అనే పదానికి ఎంత గొప్ప విలువ! ఈనాటి bye, bye అనే పదానికి ఏమైనా విలువ వుందా? ఈవిధంగా విద్యావిధానము అథఃపతనమైపోతున్నది.

అధ్యాపకులారా! మన పిల్లలకు 3P ల గురించి బోధించాలి. ఏమిటా 3Pలు? 1. purity, 2. patience, 3.perseverence. పవిత్రత, సహనం, పట్టుదల. ఈ మూడింటిని బాలబాలికలకు అందించినప్పుడు వారు ఈ దేశాన్ని రక్షించగలరు. ఈనాడు దేశాన్ని రక్షించేవి తుపాకులు కావు, రాజకీయాలు కావు, బాంబులు కావు, మరేవీ కావు. నీవు మిలటరీలో చేరి తుపాకీ పట్టుకొని దేశాన్ని రక్షించటానికి ఏమీ శ్రమపడనక్కరలేదు. నీవు రక్షించవలసినది దేశాన్నికాదు, సత్యధర్మాలను రక్షించాలి. ఈ సత్యధర్మాలను రక్షిస్తే, అవే దేశాన్ని రక్షిస్తాయి. సత్యమే దైవము. అన్ని దేశములవారికి, అన్ని మతములవారికి సత్యం ఒక్కటే, ఒక్కటే. 'ఇది అమెరికన్ సత్యం, ఇది బ్రిటీష్ సత్యం, ఇది ఇండియన్ సత్యం...' అనేది లేదు. సత్యం అందరికీ ఒక్కటే. దానిని మనం రక్షించాలి. ఇంక ధర్మమనేది ప్రత్యేకంగా లేదు. ఇంక ధర్మమనేది ప్రతేయకంగా లేదు. 'సత్యాన్నాస్తి పరోధర్మః' సత్యమనే పునాదిపై ధర్మమనే భవనం నిలిచియున్నది. కనుక, ఈ రెండింటినీ కాపాడుకుంటే మన నివాసం సుక్షేమంగా వుంటుంది.

ఈనాటి పిల్లలకు ఆధ్యాత్మికము పట్ల విశ్వాసం కలిగే మార్గాన్ని మనం చూపించాలి. ఈనాడు విశ్వాసమే పోయింది. విశ్వాసమున్నప్పుడే ప్రేమ మనలో ఆవిర్భవిస్తుంది. 'ఆమె నా తల్లి' అని నీవు విశ్వసించినప్పుడే ఆమెపై నీకు ప్రేమ కలుగుతుంది. కనుకనే,

విశ్వాసమెక్కడో ప్రేమ అక్కడ
ప్రేమ ఎక్కడో శాంతి అక్కడ
శాంతి ఎక్కడో సత్యమక్కడ
సత్యమెక్కడో ఆనందమక్కడ
ఆనందమెక్కడో దైవమక్కడ

మొట్టమొదట Self-sacrifice, ఆత్మవిశ్వాసము పునాదిగా వుండాలి, Self-satisfaction, ఆత్మతృప్తి గోడలుగా వుండాలి. Self-sacrifice, స్వార్థత్యాగం పైకప్పుగా వుండాలి, Self-realisation ఆత్మసాక్షాత్కారం లైఫ్‌గా వుండాలి. అప్పుడే అది పూర్ణమానవత్వమౌతుంది.

అధ్యాపకులారా! మీరు కేవలం బోధించినంతమాత్రమున చాలదు. తల్లిదండ్రులను కూడా పిలిపించి వారితో మీటింగు ఏర్పాటు చేసి, 'అబ్బాయి ఇంటి దగ్గర ఏవిధంగా వుంటాడు? ఏవిధంగా ప్రవర్తిస్తాడు?' అనే విషయాలను కూడా గుర్తించాలి. చాలామంది అధ్యాపకులు పల్లెప్రాంతాలయందు పనిచేస్తున్నారు. అక్కడ పిల్లలచేత భజనలు చేయించటం, వారికి కథలు చెప్పటం, శ్లోకాలు నేర్పించటం, ఇంత మాత్రమున ప్రయోజనం లేదు. ఆరోగ్యమే మహాభాగ్యము కనుక, ఆరోగ్యాన్ని గురించి చక్కగా బోధించాలి. కొన్ని కొన్ని కుగ్రామాల్లో త్రాగే నీటియందు ఫ్లోరైడ్ అధికంగా వుంటున్నది. దానివల్ల పళ్ళు చెడిపోతుంటాయి, ఎముకలు విరిగిపోతుంటాయి. కాని, ఈవిషయం తెలియని పిల్లలు అలాంటి నీరు త్రాగి అనారోగ్యానికి గురియౌతుంటారు. కనుక, ఆ పిల్లలకు త్రాగేనీరు, తినేతిండి, వాతావరణ పరిశుద్ధత మొదలైనవాటిగురించి కూడా బోధించాలి. కడుపులో మండిపోతుంటే తలలోనికి విద్య ఎట్లా చేరుతుంది? ఫుడ్, హెడ్, గాడ్– ఈ మూడింటి ఏకత్వాన్ని చేయాలి. అప్పుడే బాలబాలికలు ఆదర్శవంతమైన పౌరులుగా రూపొందుతారు.

ఈ రాబోయే మూడుదినములయందు, మీలో ఎవరెవరికి ఏఏ మార్గములందు ఏఏ సమస్యలుంటున్నాయో, వాటిని పరిష్కరించటానికి మీలోమీరు చిన్నచిన్న గ్రూపులుగా చేరి తగిన ఉపాయాన్ని వెదకాలి. మీరు స్వార్థాన్ని త్యజించి పరార్థానికి స్వాగతం పలకాలి. దేనినైనా ధైర్యంగా ఎదుర్కోవాలి.

Life is a challange, meet it
Life is a game, play it
Life is love, enjoy it
Life is a dream, realise it.

ఏమిటీ జీవితం? ఈ దేహమొక నీటిబుడగవంటిది. దేహ, మనో, బుద్ధి, ఇంద్రియాలన్నీ పనిముట్లవంటివి. అంతరాత్మయే వీటికి మాస్టర్. కనుక, దానిని నీవు అనుసరించు.

Follow the Master
Face the Devil
Fight to the end
Finish the game.

ఇదే మీరీనాడు చేయవలసినది. పిల్లలయందు కూడా ఈవిధమైన ఉత్సాహము, ఆనందము కలిగేటట్లు చేయాలిగాని, నిరాశా నిస్పృహలు కలిగేటట్లు చేయకూడదు. మీ బిడ్డలు చెడిపోతే మీరెంత బాధపడతారు. అట్లనే పరుల బిడ్డలు చెడిపోతే మీకు బాధ వుండదా? మీకు పుట్టిన బిడ్డలు కామపుత్రులు, విద్యార్థులందరూ మీకు ప్రేమపుత్రులు. కాబట్టి, మీరు ప్రేమతో వారిని ఏకత్వం గావించాలి.

(1994 జూలై 19వ తేదీ బృందావనంలో బాలవికాస్ గురువుల సమావేశ ప్రారంభంలో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)